మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు: ఆర్డీవో

**నర్సాపూర్ ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** పట్టణంలోని ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్టీవో మహిపాల్ హెచ్చరించారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో రోడ్డు భద్రతా చర్యలు, ట్రాఫిక్ సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ మహిపాల్ మాట్లాడుతూ నర్సాపూర్ బస్టాండ్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్లలో పండ్ల దుకాణాలు, గప్‌చుప్ బండ్లు, కూరగాయల దుకాణాలు, మిర్చిబండ్లు, హోర్డింగ్ బోర్డులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, సోడాబండ్లువంటివి ఫుట్‌పాత్‌లపై పెట్టవద్దన్నారు. ఈ మేరకు నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ అధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు. నిబంధనలే ఉల్లంగించినట్లయితే చట్టపరంగా తగిన చర్యలు తీసుకొని జరిమానా విధించి కోర్టుకు పంపుతామని ఆర్డీవో మహిపాల్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, నర్సాపూర్ తహసిల్దార్ శ్రీనివాస్, సీఐ జాన్ రెడ్డి, ఎంపీ ఓ వైద్య శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షంతో అన్నదాతకు నష్టం

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** అకాల వర్షం కారణంగా అన్నదాతకు తీరని నష్టం వాటిల్లింది. చిన్నశంకరంపేట మండలం లో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. పలు గ్రామాలలో పంటలు దెబ్బతిన్నాయి. అకస్మాత్తుగా వచ్చిన వర్షానికి అన్నదాత ఆగమయ్యాడు. చేతికందిన పంట తడిసిపోవడంతో అన్నదాత ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం త్వరగా తూకం వేయాలని రైతులు కోరుతున్నారు.



శాలిపేటలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం





మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

## భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

భూసమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. గురువారం రోజున జిల్లా కేంద్రంలోని విపంచి ఆడిటోరియంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ చట్టం గురించి రెవేన్యూ అదనపు కలెక్టర్ మహ్మద్ హామీద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వార అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భూభారతి గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏప్రిల్ 17వ తేదీ నుండి 30 వరకు జిల్లా లోని అన్ని మండలాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గతంలో తహసీల్దార్‌లు, ఆర్డీవోల వద్ద తీసుకున్న నిర్ణయాలు సరైనవి కావని భావించిన ప్రతీ ఒక్కరు ఇందులో అప్పిల్ చేసుకునే అవకాశం కల్పించినట్లు వివరించారు. ఈ రికార్డు ద్వార ప్రజలకు ఉపయోగపడే విషయాలను వారు వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, సిద్దిపేట ఆర్డీవో సదానందం, ప్రజాప్రతినిధలు, అధికారులు ఉన్నారు.

## భూభారతిపై సదాశివపేటలో అవగాహన

### -అవగాహన కల్పించిన చైర్మన్, జిల్లా కలెక్టర్



భూభారతిపై అవగాహన కల్పిస్తున్న చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

**సదాశివపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** భూభారతిపై గురువారం పట్టణంలోని దుర్గా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా టిజి ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిలు హాజరై అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసిన కలెక్టర్, చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సందేశాన్ని ముందుగ చదివి వినిపించి భూభారతిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్, ఆర్‌డిఓ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ కె సరస్వతి, రెవిన్యూ, వ్యవసాయ అధికారులు, రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నేడు చేవెళ్లలో భూభారతిపై అవగాహన సదస్సు

### -హాజరుకానున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**అల్లాదుర్గం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** ఈ నెల 18వ తేదీన మండల పరిధిలోని చేవెళ్లలో భూభారతిపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లయ్య పేర్కొన్నారు. అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్, మెదక్ ఆర్‌డిఓ, రెవిన్యూ సిబ్బందిలు హాజరై భూభారతపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమానికి మండల ప్రజలు పాల్గొని భూభారతిపై అవగాహన పొందాలన్నారు.

## సిల్వర్ జూబ్లీ బహిరంగ సభ టిఆర్ఎస్‌కా? బిఆర్ఎస్‌కా?

### కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ర్యాకం యాదగిరి

**మర్కుక్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త):** ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే సిల్వర్‌జూబ్లీ బహిరంగ సభ టిఆర్ఎస్ పార్టీకా? బిఆర్ఎస్ పార్టీకా? అనేది అర్థం కావడంలేదని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ర్యాకం యాదగిరి ప్రశ్నించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఏర్పాటుచేసిన రాజకీయ పార్టీ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి(టిఆర్ఎస్) పార్టీని ప్రారంభించి ఉద్యమాలుచేసి రాష్ట్రాన్ని సాధించి ముఖ్యమంత్రి అయిన కెసిఆర్ 2022 అక్టోబర్ 5న భారత రాష్ట్ర సమితిగా పేరు మార్చారని తెలిపారు. టిఆర్ఎస్ ఏర్పాటుచేసి 21 సంవత్సరాలు కాగా బిఆర్ఎస్ ఏర్పాటుచేసి రెండున్నర సంవత్సరాలు అవుతుందని, ప్రస్తుతం సిల్వర్ జూబ్లీ కార్యక్రమం ఏ పార్టీకి నిర్వహిస్తున్నారో అర్థం కావడంలేదని, ఈ విషయాన్ని పార్టీ నేతలు స్పష్టం చేయాలని అన్నారు. టిఆర్ఎస్, బిఆర్ఎస్‌కు 25 సంవత్సరాలు నిండకముందే అత్యుత్సాహంతో సిల్వర్ జూబ్లీ భారీ బహిరంగ సభ దేశానికి ఆదర్శంగా నిలవాలని కలలుకంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, గత కెసిఆర్ పది సంవత్సరాల పాలనలో రాష్ట్రం అప్పులపాలైందని విమర్శించారు.

## చిరుత సంచారంతో కలకలం-ఇక్రిసాట్‌లో చిక్కిన చిరుత

**రామచంద్రాపురం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** ప్రజలను భయాందోళనకు గురి చేసిన చిరుతపులిని అధికారులు బోనులో బంధించిన సంఘటన రామచంద్రాపురంలోని అంతర్జాతీయ పంట పరిశోధనా కేంద్రం(ఇక్రిసాట్) పరిసరాల్లో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఇక్రాసాట్ పరిసరాల్లో చిరుతను చూశామని ఇక్రిసాట్ అధికారులు, ప్రజలు తెలపడంతో అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఇక్రాసాట్‌లో బోన్లు ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. అత్యాధునిక టాప్ కెమెరాల సహాయంతో చిరుత కదలికలను గుర్తించిన అధికారులు గురువారం తెల్లవారుజామున బోనులోకి చిరుత వెళ్లేలా చేశారు. బోనులో చిక్కిన చిరుత పులిని హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్‌రావు మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండటంవల్లే ప్రాణహానీలు జరగకుండా చిరుతను పట్టుకోగలిగామన్నారు. చిరుత పులి ఆరోగ్యంగా ఉందని, జూ పార్కులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని శ్రీధర్‌రావు వివరించారు.



ఇక్రిసాట్‌లో చిరుతను బోనులో బంధించిన అటవీ అధికారులు

## కాంగ్రెస్‌పై కక్షసాధింపులకు పాల్పడుతున్న బిజెపి

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ, గాంధీ కుటుంబానిది అని రాష్ట్ర రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ అభివృద్ధి కోసం ప్రాణాలను సైతం లెక్క చేయని గాంధీ కుటుంబంపై నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రధాని మోడీ, అమిత్‌షాలు కాంగ్రెస్‌కు దేశ వ్యాప్తంగా వస్తున్న ఆదరణను చూసి భయంతో కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేకనే బిజెపి బలహీన పడే సందర్భంలో కాంగ్రెస్‌ను ఎలాగైనా బలహీనపరచాలని, వేధింపులకు గురి చేయాలని చూడడం సిగ్గు చేటన్నారు. ఇది కచ్చితంగా రాజకీయ కక్షసాధింపు అన్నారు. బిజెపి దేశంలోకి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సిబిఐ, ఈడిల మీద ఆధారపడి మాత్రమే ప్రభుత్వాన్ని నడిపిస్తోందన్నారు. వారి మిత్ర పక్షాలు ఎలాంటి కార్యక్రమాలకు పాల్పడినా వాటిపై మాట్లాడకుండా రాజకీయంగా ప్రజల హక్కుల కోసం పోరాడే కాంగ్రెస్ అగ్రనేతలపై కక్షసాధింపు ధోరణికి పాల్పడడం మంచిది కాదన్నారు. దేశం మొత్తం ప్రస్తుతం గాంధీ కుటుంబానికి అండగా ఉంటుందని బిజెపి కక్షసాధింపు చర్యలకు దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డాక్టర్ అక్కి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న మంత్రి



కాలి బూడిదైన వస్తువులను పరిశీలిస్తున్న గ్రామస్థులు

## షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**అక్కన్నపేట, ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని పంతుల్‌నాయక్‌తండాలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బానోతు దేవోజీ కుటుంబ సభ్యులు రోజు మాదిరిగానే పనులకు వెల్లగా ఉదయం 11 గంటల ప్రాంతంలో వారి ఇల్లు దగ్ధమైందని గ్రామస్థుల ద్వార తెలుసుకుని ఇంటికి పరుగులు తీశారు. షాట్ సర్క్యూట్ వల్ల ఇంట్లోని వస్తూలన్ని దగ్ధం అయి బూడిద కాగా వారు మహిళా సంఘం నుండి అప్పుగా తీసుకున్న రూ 1లక్ష రూపాయలతో పాటు ఇంట్లో ఉన్న వస్తూవులు అన్ని కాలిపోగా మొత్తం రూ 5లక్షల వరకు నష్టపోయి ఉంటారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం బాదిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**సదాశివపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** జాతీయ రహదారిపై ఆరూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం జరిగింది. ఎస్ఐ ఎం మహేష్‌గౌడ్ కథనం ప్రకారం... వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన బోడంపల్లి రాజయ్యముదిరాజ్ వ్యవసాయం చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడన్నారు. గురువారం ఉదయం రాజయ్య టివిఎస్ ఎక్సెల్‌పై సదాశివపేట నుంచి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో వెనుకాల నుంచి వస్తున్న టిఎస్ 08 యుహెచ్ 8699 వాహనం ఢీకొనడంతో రాజయ్య తీవ్ర గాయాలకు గురయ్యాడన్నారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ తిరిగిరాని లోకాలకు చేరిపోయాడన్నారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

**వెల్దుర్తి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** బైక్ అదుపుతప్పి కింద పడటంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం వెల్దుర్తి మండలం ఆరెగూడెం గ్రామ శివారులో చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన రమేష్ ఆరెగూడెం గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి క్రింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. 108లో తూప్రాన్ ఆసుపత్రికి తరలించారు.



వినతి పత్రం అందిస్తున్న బిజెపి నాయకులు

## గౌరవెల్లి,గండిపల్లి ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తి చేస్తారు...!?

### ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి భారీ ర్యాలీ

**అక్కన్నపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** మెట్టప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గంలో రైతులను సాగునీటిని అందిచాలనే ఉద్దేశంతో ప్రారంభించుకున్న గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్‌చేస్తూ గురువారం భారతీయ జనతాపార్టీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్‌చౌరస్తా నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కవితకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ ప్రాంత శాసనసభ్యులు, రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల సమయంలో గౌరవెల్లి, గండిపల్లి పనులను గెలిచిన వెంటనే ప్రారంభించి పూర్తిచేస్తానని హామీఇచ్చి సంవత్సరం దాటినా ఇప్పటివరకు ఎందుకు పనులు జరగడం లేదని ప్రశ్నించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో పదేళ్లు అధికారంలో ఉన్నా ఈ ప్రాంత అభివృద్ధికి నోచుకోలేదని, ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే ఈ ప్రాంత ఎమ్మెల్యే మంత్రి పధవి పొంది ప్రజలకు అందుబాటులో లేకుండా సమస్యలను పట్టించుకోకపోవడం భాదాకరమైన విషయమన్నారు. ఎన్నికల సమయంలో ఈ ప్రాంత ప్రజలకు మంత్రి ఇచ్చిన హామీ మేరకు వెంటనే ప్రాజెక్టులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రావు, కర్ణకంటి నరేష్, చెరుకు సంపత్, గుగులోతు మోహన్‌నాయక్, తిరుపతినాయక్, స్వరూప, కవిత, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

**శివ్వంపేట, ఏప్రిల్ 17(ప్రభాతవార్త) :**

ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన కుల్ల మల్లేష్ భార్యాభర్తలు సంసార విషయంలో గొడవపడ్డారు. ఈనెల 16న రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో అతని భార్య కుల్ల లక్ష్మి చుట్టుపక్కల వెతికిన బంధువులకు ఫోన్ చేసి అడిగిన ఆచూకి లభించలేదు. ఈ విషయంపై మల్లేష్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు

# నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

### మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి.. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రికసమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ పిలుపునిచ్చారు. గురువారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో జరిగిన ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా.. ముఖ్యంగా నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ 2025 మార్చి 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఆల్ ట్రేడ్ యూనియన్స్, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన బిజెపి ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను అమలు చేస్తుందని మండిపడ్డారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిస్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందని దుయ్యబుట్టారు. వీటికి వ్యతిరేకంగా ఐదేళ్లుగా ఆందోళన, పోరాటాలతో లేబర్ కోడ్‌ల అమలును నివారించగలుగుతుందన్నారు. నేడు వాటిని అమలు చేసి, కార్మిక హక్కులను పూర్తిగా హరించే ప్రయత్నం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్నదని వాపోయారు. సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టి, సామాన్యులపై భారాలు మోపి, కార్పొరేట్ గుత్తా సంస్థలకు, పెట్టుబడిదారులకు వేల కోట్ల రాయితీలు ప్రకటించడంలోని అంతర్యం ఏంటో చెప్పాలన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే నాలుగు లేబర కోడ్లను అమల్లోకి తెచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించకుండా వెట్టిచాకిరి చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లు రూపొందించారన్నారు. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" పేరుతో కార్మికుల సమ్మె హక్కును నిర్వీర్యం చేస్తూ, సమ్మె చేయాలనే పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం ఈకోడ్‌ల ద్వారా కల్పించే కార్మికులను తిరిగి బానిసత్వంలోకి నెట్టేసే ప్రయత్నం చేస్తుందని అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకునేలా, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమికహక్కులను రక్షించుకునేందుకు, కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు 2025 మే 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగస్వామ్యం అవుతున్నాయన్నారు. ఈ సమ్మెను మెదక్ జిల్లాలోని ఆల్ ట్రేడ్ యూనియన్స్, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు, జిల్లా కార్మిక వర్గం సమ్మెకు సన్నద్ధం కావాలని, నాలుగు లేబర్ కో రద్దుకు రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకై మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మెదక్ జిల్లాలోని సంఘటిత, అసంఘటిత, ప్రభుత్వరంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులు అందరూ పాల్గొని, ఈ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అజ్జమర్రి మల్లేశం, జిల్లా కోశాధికారి కడారి నర్సమ్మ, కోరింకల మల్లేశం, సంతోష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నందం, వివిధ రంగాల కార్మికులు, అల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్



పిడుగుపాటుకు మృతి చెందిన మేకలు

## కుప్పానగర్‌లో పిడుగుపాటుకు 23 మేకల మృతి

**ఝరాసంగం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** పిడుగు పాటుకు 23 మేకలు మృత్యువాత పడిన సంఘటన మండల పరిధిలోని కుప్పానగర్‌లో చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ తిరుమలరావు ఎస్ఐ నరేష్‌లు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గొర్రెలు మృతి చెందిన వివరాలను గొర్రెల కాపరి పిచ్చకుంట్ల బాలప్పను అడిగి తెలుసుకున్నారు. 23 మేకల మృతితో బాలప్ప రోడ్డు పాలు కాకుండా ప్రభుత్వం అందుకోవాలని గ్రామస్థులు వినతి చేశారు.

## ఆడవేషంలో చోరీలు..చితకబాదిన గ్రామస్థులు



ఆడవేషంలో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసు ఠాణాకు చేరిన వ్యక్తులు

**మనూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** చీరలు కట్టుకుని న్యాల్‌కల్‌కు చెందిన తులసిరామ్, చంద్రయ్య ఆడవేషంలో చోరీలకు పాల్పడుతూ ప్రజలకు చిక్కి పోలీసు ఠాణా మెట్లెక్కిన సంఘటన గురువారం మనూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం...ఇద్దరు మగవారు ఆడవేషాలు ధరించి (కొజ్జాలుగా) నటిస్తూ మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మండల పరిధిలోని బాదల్‌గావ్‌లో చోరీలకు పాల్పడ్డారు. మనూర్‌లోని అంబన్న హోటల్‌లో దొంగతనం చేసి అదే గ్రామానికి చెందిన సయ్యద్ మన్నన్ ఇంట్లో దొంగతనానికి యత్నిస్తుండగా గ్రామస్థులు పట్టుకుని చితకబాది పోలీసులు అప్పగించారు. ఈ సంద్భంగా ఎస్ఐ శంకరయ్య మాట్లాడుతూ న్యాల్‌కల్ గ్రామానికి చెందిన చంద్రయ్య, తులసిరామ్‌లు ఆడవేషంలో (హిజ్రాలుగా) గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## ఎండుగంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్



పోలీసుల అదుపులో ఎండు గంజాయి తరలిస్తున్న నల్గురు వ్యక్తులు

**మునిపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** ఎండు గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులు పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన కంకోల్ టోల్ ఫ్లాజా వద్ద గురువారం జరిగింది. ఎస్ఐ రాజేష్ నాయక్ కథనం ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు జహీరాబాద్ నుంచి హైదరాబాద్‌కు మారుతి సుజీకి (టిఎస్ 08యూహెచ్ 8337) కారును టోల్ ఫ్లాజా వద్ద తనిఖీ చేయగా 130 గ్రామల ఎండు గంజాయి లభ్యమైందన్నారు. కారులో అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్న వత్సల్ రాంశెట్టి, ఆకాష్, అజయ్‌దేశ్‌పాండే, సోహెల్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా కర్ణాటకలోని బీదర్ పట్టణంలోని ఇరాన్‌గల్లిలో ఎండు గంజాయిని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారన్నారు. నలుగురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, 130 గ్రాముల ఎండు గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయిని పట్టుకున్న ఎస్ఐని, పోలీసు సిబ్బందిని సిఐ వెంకటేష్ ప్రత్యేకంగా అభినందించారు.

## చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

**మర్కుక్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త):** మర్కుక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017లో జరిగిన చైన్‌స్నాచింగ్ కేసులో ఇద్దరికి ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించడం జరిగిందని ఎస్ఐ దామోదర్ తెలిపారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన గారం సాయిగౌడ్, వెండి రజనీకాంత్ ఇరువు దొంగలు 2017 సంవత్సరంలో మర్కుక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. వీరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేయగా గురువారం గజ్వేల్ కోర్టుకు తరలించినట్లు తెలిపారు. కోర్టులో ఇరువురు దొంగతనం చేసినట్లు ఒప్పుకోగా సంవత్సరం జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

## మూగజీవాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

**వర్గల్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త):** మూగ జీవాలు మేకలు, గొర్రెలను చోరీచేసి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్న ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం హైదరాబాద్‌లోని బర్కత్‌పురకు చెందిన నీరజ్‌కుమార్ ఇంచురే, కాచిగూడకు చెందిన మాఖన్‌విశాల్‌సింగ్ మరో ఇద్దరు వ్యక్తులు రాహుల్, బాబుతో కలిసి గతనెల 24న దిల్‌సుఖ్‌నగర్‌లోని లాంగ్ డ్రైవ్ కార్ అద్దెకు తీసుకొని వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంకు చేరుకొని చీర్ల మల్లేశంకు చెందిన నాలుగు మేకలను కారులో వేసుకొని హైద్రాబాద్‌లోని జియాగూడకు వెళ్ళి విక్రయించి సొమ్ము చేసుకున్నారు. అలాగే గతనెల 26న తొగుట శివారులో గల రాంపూర్ గ్రామానికి చేరుకొని అక్కడ నాలుగు గొర్రెలను ఎత్తుకెళ్ళారు. ఈ క్రమంలో గురువారం నీరజ్‌కుమార్‌ఇంచురే, మాఖన్‌విశాల్‌సింగ్ అనే ఇద్దరు కారులో ఉదయం 7 గంటల ప్రాంతంలో గౌరారంవద్ద ఉన్న హిల్-7 హోటల్‌వద్ద అనుమానంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాల విషయం ఒప్పుకున్నారు. దీంతో వారిద్దరిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.



వివరాలు తెలుపుతున్న ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు



సన్మాన సభలో పాల్గొన్న దుద్యాల ఆశ్రమ పీఠాధిపతి అంబికా శివయోగి మహారాజ్

**పెద్ద శంకరంపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని దుద్యాల ఆశ్రమ పీఠాధిపతిఅంబికాశివయోగి మహారాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పిజిహెచ్ఎం కంది రాజేశ్వర్ పదవీ విరమణ సన్మాన సభలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు విలువలను కూడా నేర్చుకోవాలన్నారు. గురువులు నేటి సమాజానికి ఎంతో అవసరమని, జ్ఞాన సంపదకు పుట్టినిల్లు గురు బోధనలే అనిఆయన వివరించారు.క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను ఉపాధ్యాయులు విద్యార్థులకు అందించాలనిపేర్కొన్నారు. మండల విద్యాధికారివెంకటేశం, ఆయాఉపాధ్యాయ సంఘాల బాధ్యులు రామచంద్ర చారి, బి. శ్రీనివాస్, విజయ్ కుమార్, ఆనంద్ ప్రసన్నకుమార్, మారుతి, కె.వి రవీందర్, గోపి రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జేసీ నాయకులు

## డంపింగ్ యార్డ్‌తో మా బతుకులను పాడు చేయొద్దు

**గుమ్మడిదల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** నలవల్లి గ్రామపంచాయతీనోటిస్‌బోర్ట్‌లోగుమ్మడిదల మండలం తహసీల్దార్ అంటించిన ప్రజాభిప్రాయణా సేకరణలో భాగంగా గుమ్మడిదల మండలం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండల నాయకులు పాల్గొని డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయొద్దంటూ వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. నర్సాపూర్ అటవీ ప్రాంతం దాదాపు 30 చదరపు కిలోమీటర్లు అంటే దాదాపు 7,413 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉందని, గుమ్మడిదల, నర్సాపూర్, శివ్వంపేట్ ఈ మండలలోని 74 గ్రామాలు దాదాపు 3 లక్షల ప్రజల జీవితాలు,లక్షలఎకరాల వ్యవసాయ ఆధారిత భూమి, వ్యవసాయపై ఆదారపడ్డ రైతుకుటుంబాలుచిన్నాభిన్నం కాబోతున్నాయని, ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే అక్కడ ఉత్పతి అయ్యే వ్యర్థ జలాలు వల్ల పక్కనే ఉన్న వాగులో కలిసి అక్కడి నుండి సర్సాపూర్ మున్సిపాలిటికి జీవనాధారమైన రాయారావు చెరువు భూగర్భ జలాలు కలుషితమై గొలుసు కట్టు చెరువులైన పక్కన గ్రామాల్లోని దాదాపు 20 గ్రామాల చెరువు కలుషితంగా మారుతాయని అన్నారు.ఈ ప్రాంతంలో నివసించడం ప్రశ్నార్థకం అవుతుందని, కావున తమ ప్రాంతము నుండి డంపింగ్ యార్డ్ ప్రతిపాదిత నిర్ణయాన్ని తీసివేయాలని తీవ్రంగా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, పలుగు గోవర్ధన్ రెడ్డి, శ్యామల రాజిరెడ్డి, విజయ్ కుమార్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి తండ్రుల యాదిలో చలివేంద్రం ఏర్పాటు

**గుమ్మడిదల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో చలివేంద్రం ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తల్లి తండ్రులు కీ.శే. పోతురాజు నర్సమ్మ, బాల నర్సయ్యల జ్ఞాపకార్థంగా వారి కుమారుడు సుధాకర్ కానుకుంట గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. గత 15 సంవత్సరాలుగా ప్రతి వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పుట్ట నర్సింగ్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జయశంకర్ గౌడ్, మూడు చింతల నరేందర్ రెడ్డి, బిక్షపతి, మహిపాల్ రెడ్డి, అంజాత్ ఖాన్, బేకు నీలమ్మ, బొడ్డు భవాని, జుర్రు వెంకటేష్, నర్సింహా రెడ్డి, గడ్డం యాదగిరి, పెంట రెడ్డి, కుమ్మరి వెంకటేష్, రమేష్, గ్రామ పెద్దలు నక్క వెంకటేష్ గౌడ్, బాల్ రెడ్డి, భార్గవ చారి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో అలరించిన ఆటపాటలు

**నారాయణఖేడ్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** మండలపరిధిలోని లింగాపూర్‌లో అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులు అలరించారు. గురువారం స్నాతకోత్సవ దినం సందర్భంగా విద్యార్థులు ఆటలు, పాటలు,నాటికీకరణకథలువివిధకార్యక్రమాలుచేసి ఆకట్టుకున్నారు. ఈకార్యక్రమానికిముఖ్య అతిథిగా హాజరైన సిడిపిఓ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రమీల, మాజీ ఎంపీటీసీ లక్ష్మీ, శిశు సంక్షేమ కోఆర్డినేటర్ నరసింహులు, అంగన్వాడి టీచర్స్ ఇందిరా, విజయ, ఉపాధ్యాయులు సునీల్, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చేది మన ప్రభుత్వమే

### కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

**నారాయణఖేడ్/నిజాంపేట్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ కార్యకర్తలారా ఆందోళన చెందకండి.. వచ్చేది మన ప్రభుత్వమే అని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. నిజాంపేట్ మండల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణఖేడ్ ప్రాంత మండలాల గ్రామాల నుండి దండులాగా కదిలి వరంగల్‌లో జరగబోయే 27వ తేదీన జరగబోయే భారీ బహిరంగ సభలో గులాబీ జెండా ఎగరేద్దామని బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఎం. భూపాల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 27వ తేదీన వరంగల్ లో జరగబోయే బిఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ గురించి భవిష్యత్తులో జరిగే పోరాటాల గురించి వివరించారు. అధికారం కోల్పోయామని ఇప్పుడు కష్టపడదామని భవిష్యత్తులో మనకు, కార్యకర్తలకు, ప్రజలకు సంక్షేమ పథకాలు ఇచ్చి సుఖపెడదామని ధీమ వ్యక్తం చేశారు. రానున్నది మన ప్రభుత్వమేనని, ఆందోళన ఎవరు చెందవద్దన్నారు.రోజురోజుకు బిఆర్ఎస్ పార్టీ ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని, ఈ అవకాశాన్ని మనమందరం సద్వినియోగం చేసుకొని అధికారం దిశగా అడుగులేద్దామన్నారు. అందుబాటులో ఉండి ఎల్లవేళలా కార్యకర్తలకు, ప్రజలకు, నాయకులకు ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. వరంగల్ భారీ బహిరంగ సభకు భారీ ఎత్తున గులాబీ సైన్యం కదిలి వరంగల్ బహిరంగ సభ విజయవంతం చేద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నరసింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు సాయి రెడ్డి, అంజిరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దుర్గారెడ్డి, మాజీ తాజా మాజీ సర్పంచులు, తాజా మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, తాజా మాజీ వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పటాన్ చెరు, దౌల్తాబాద్ రహదారి మరమ్మతులు చేపట్టాలి

### భారీ వాహనాలతో రహదారి గుంతల మయం ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కు వినతి పత్రం అందజేత



సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

**పటాన్‌ఛెరు,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** పటాన్ చెరు నుండి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టి, వెంటనే రోడ్డును విస్తరింప చేయాలని సిపిఎంపార్టీ డివిజన్ కార్యదర్శి బి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రహదారి పనులు వెంటనే చేపట్టాలంటే గురువారం పటాన్‌చెరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ రంగారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంద్రేశం నుండి పెద్ద కంచర్ల వరకు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతం మీదుగా రోజువారీగా వేలాదిమంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారని, భారీ నుంచి అతి భారీ వాహనాలు అధికలోడుతో వెళుతున్నాయని అన్నారు. దీనివలన ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిపోయిందన్నారు.

ఇంద్రేశం ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, రోడ్డు సక్రమంగా లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. భారీ వాహనాలు తిరగడం మూలంగా దుమ్ము ధూళితో ప్రయాణించేవారు ఇబ్బందులు ఎదుర్కొంటూ అనారోగ్యానికి గురవుతూ, రోగాల బారిన పడుతున్న అధికారంలో చలనం లేకపోవడం దారుణం అన్నారు. ఆర్ అండ్ బి రోడ్డు పునర్నిర్మానంపట్ల ఈప్రాంతప్రజాప్రతినిధులుపూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. గుంతల మయమైన రోడ్డుకు మరమ్మత్తులకు మంజూరి కోసం ఐదు కోట్ల రూపాయల ప్రతిపాదనలు పంపినామని ఆర్ అండ్ బి అధికారులు చెబుతున్న నేటికీ పెండింగ్ లోనే ఉన్నదని ఆరోపించారు. ఈ ప్రాంతం రియల్ ఎస్టేట్ పరంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న, అపార్ట్మెంట్లు నిర్మాణం జరుగుతున్న వేల రూపాయల్లో టాక్సు గ్రామపంచాయతీలకు సమర్పిస్తున్న, మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పన్నుల మీద ఉన్న శ్రద్ధ ప్రజలకు సేవ చేసే విషయంలో లేదని విమర్శించారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రోడ్డు పునర్నిర్మాణం కోసం ధర్నా, సంతకాల సేకరణ, ఐనోలు నుండి పటాన్ చెరు వరకు పాదయాత్ర కార్యక్రమాలు చేయడం జరిగిందని అన్నారు.

ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని రోడ్డు పనులు వెంటనే ప్రారంభించి విస్తరణ చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు ఎం శ్రీనివాస్, రామకృష్ణ, నారాయణ ఇతరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ మన్నన్

**చిన్నశంకరంపేట,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులుసద్వినియోగంచేసుకోవాలని మండల తహసీల్దార్ మన్నన్ సూచించారు. గురువారం మండలపరిది ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాన్నిప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.ఏపీవోలక్ష్మీనారాయణ,పంచాయతీ కార్యదర్శి అనురాధ, సీసీ రాజు, మాజీ సర్పంచి లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ శివకుమార్ పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రానికి పరికరాల పంపిణీ

**షాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెల్స్పన్ ఫౌండేషన్ ద్వారా వైద్య పరికరాలను గురువారం ఉచితంగా అందజేశారు. వెల్స్పన్ ఫౌండేషన్ ఫ్లోరింగ్ వైస్ ప్రెసిడెంట్, ఐటి హెడ్ సుబ్రహ్మణ్యం గుప్తా మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామస్థులకు ఎన్నో వైద్య ఆరోగ్య సేవలు అందుతున్నాయని, వాటిని మరింత పటిష్ఠ పరిచే విధంగా తమవంతుగా వైద్య పరికరాలను అందజేస్తున్నా మన్నారు.అందులోభాగంగానే బిపి మనిటర్, థర్మామీటర్లు, బయో మెడికల్ వ్యర్థాల కొరకు బిన్స్, గ్లూకోమీటర్, పల్సాక్సీ మీటర్, ఫీటల్ డాప్లర్ తదితర పరికరాలను ఆసుపత్రికి అందజేశామన్నారు. వెల్స్పన్ ఫౌండేషన్ సి ఎస్ ఆర్ హెడ్ శ్రీమతి కె. సురేఖ, షాబాద్ పీహెచ్ సి ఆరోగ్య అధికారి డాక్టర్ ప్రభాకర్, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, పీహెచ్ సిసిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

**షాబాద్,ఏప్రిల్17,ప్రభాతవార్త:**ప్రభుత్వపాఠశాలలోపిల్లలను చేర్పించేందుకు గ్రామస్తులు చొరవ తీసుకోవాలని ఎల్గొండగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేష్ గౌడ్అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా షాబాద్ మండల పరిధి లోనిఎల్గొండగూడగ్రామంలో గురువారం బడిబాట నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు చేర్పించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి, గ్రామంలో మంచి ప్రమాణాలతో విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకొని, తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడా లన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి నైపుణ్యం, శిక్షణ గల ఉపాధ్యా యులను ప్రభుత్వం నియమిస్తుందని తెలిపారు. గ్రామం నుండి ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్న 30 మంది విద్యార్థులను, ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తామని గ్రామస్తులు హామీ ఇవ్వడంతో ఆయన వారిని అభినందించారు. ఉపాధ్యాయులతో పాటు గ్రామస్థులు సతీష్, రవి,విద్యార్థులుపాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం

**తలకొండపల్లి ఏప్రిల్17,ప్రభాతవార్త :** మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మవెంకటయ్య.ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తలకొండపల్లి బీఆర్ఎస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులతోకలిసిచంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు..అధికారంలోకి రావడానికి అమలు కాని హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చి ఇప్పుడు ప్రజలను మోసం చేస్తూ ఉందని అన్నారు.రైతులకు రుణమాఫీ రైతు బంధు వివాహం జరిగిన మహిళలకు తులం బంగారం ఇస్తామని మోసం చేసిందని అన్నారు.ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల తరఫున పోరాటం చేస్తామని అన్నారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఏదుల రాజు, ఉపాధ్యక్షుడు జంగయ్య,నాయకులు మండల కృష్ణయ్య, రవీందర్,అశోక్ గౌడ్, కొండల్, వెంకటేష్, వెంకటయ్య, మల్లేష్, నర్సింహా, లింగంయాదవ్,రాఘవేందర్, జాను, నరేష్ ం పాల్గొన్నారు.

## దుద్యాల్ మండల వ్యవసాయ అధికారిగా నాగరాజు

**దుద్యాల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** మండల నూతన వ్యవసాయ అధికారిగా సదుల నాగరాజు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్చార్జి ఏవోగా పనిచేస్తున్న హిమబిందు తన రెగ్యులర్ స్థానం తాండూర్ కి వెళ్లారు. నూతన ఏవో నాగరాజు మాట్లాడుతూ.. రైతు భరోసా, రైతు భీమా, వంటి వ్యవసాయ సంబంధిత సమస్యల పరిష్కారానికి తన ను సంప్రదించాలని కోరారు. దుద్యాల్ మండల రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, ఏప్రిల్ 17 :** ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామంలో అకాల వర్షాలు, తీవ్ర గాలుల వల్ల 32 ఎకరాల కౌలు మామిడి రైతు శ్రీనివాస్ గౌడ్, 4 ఎకరాల బొప్పాయి తోట రైతు పసుల జంగయ్య తోటలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధనన రెడ్డి సందర్శించి రైతులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల కైలు రైతు శ్రీనివాస్ గౌడ్, బొప్పాయి తోట రైతు జంగయ్యలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

హార్టికల్చర్ ఆఫీసర్‌కు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ సీనియర్ నాయకుడు ఇస్నాతి శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మిద్దె గణేష్, చేగు సుధాకర్, అత్తాపురం మహేందర్ రెడ్డి, భాను, కరెడ్ల నరేందర్ రెడ్డి, రాజు నాయక్, పాల్గొన్నారు.

## నంది వనపర్తిలో ఆయుర్వేద వైద్య శిబిరం

**యాచారం,ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** యాచారంమండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో ఆయుర్వేద వైద్యురాలుఇందిరాఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు రక్తపరీక్షలు ఉచితంగా నిర్వహించారు.120 మంది రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు.వాతం వ్యాధులు,మోకాళ్ల నొప్పులు, చర్మ వ్యాధుల, స్త్రీవ్యాధులకు సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది డి రాములు, అటెండర్ సాయమ్మ, అటెండర్ ఆశా వర్కర్ అలివేలు, ప్రమీల, సైదమ్మ గ్రామస్తులు రామ్ రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

## 19న భూ భారతి పై మండల సమావేశం

**తలకొండపల్లి ఏప్రిల్ 17, ప్రభాతవార్త,**తలకొండపల్లి మండల కేంద్రంలో ఈనెల19నభూభారతిపై మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు తలకొండపల్లి తాసిల్దార్ నాగార్జున తెలిపారు. గురువారం నాడు త లకొండపల్లి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాతహసీల్దార్ నాగార్జున మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో నూతనంగా భూభారతి పోర్టల్ ను ప్రవేశపెట్టినందున మండలంలో భూభారతి పై మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. స్థానిక దేవకి గార్డెన్ ఫంక్షన్ హాల్లో మధ్యాహ్నం 2.30గంటలకు సమావేశం నిర్వహిస్తున్నందున అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## పశువులకు గాలికుంటు నివారణటీకాలు వేయించాలి

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** పశువులు, గొర్రెలు, మేకలకు వచ్చే గాలికుంటు నివారణకు గాను పశుపోషకులు జీవాలకు టీకాలు (ఎఫ్ఎండి) వేయించాలని మండల పశువైద్యాధికారిణి పద్మిని తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్, ఎదులాబాద్‌లో గురువారం పశువులకు గాలి కుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువైద్యాధికారిని పద్మిని సిబ్బందితో కలిసి ఆవులు, గెదేలకు ఎఫ్ఎండి వ్యాక్సినేషన్ చేశారు. ఈసందర్భంగా 12 మంది రైతులకు చెందిన 38 ఆవులకు, 150 గెదేలకు మొత్తం 188 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఘట్‌కేసర్ మండలంలో మొత్తం 5,865 పశువులకు గాను 1,881 ఆవులకు, 3,984 గెదేలకు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆమె తెలిపారు.

## దుకాణం నిర్వాహకులపై దాడి : ఇద్దరు అరెస్ట్

**ఘట్‌కేసర్,ఏప్రిల్17,ప్రభాతవార్త:** ఓకిరాణదుకాణం నిర్వహిస్తున్న భార్యభర్తలపై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పందిరి పరుశురాం తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్‌లో రాజస్థాన్ రాష్ట్రం నుంచి బ్రతుకుదెరువు కోసం వచ్చిన దంపతులు కిరాణ దుకాణం నడుపుతున్నారు. ఈక్రమంలో ఈనెల 16న రాత్రి 9:30 గంటల సమయంలో అవుషాపూర్‌కు చెందిన మచ్చ రాజశేఖర్, మచ్చ విశాల్‌లు వారి కిరాణ దుకాణంలోకి వచ్చి షాపులో ఉన్న మహిళ జుట్టు పట్టుకొని నూనె డబ్బాలపైకి నెట్టి అసభ్యకరంగా ప్రవర్తించారు. షాపులో కూర్చున్న 3 సంవత్సరాల పాపను కూడా నెట్టివేయగా మహిళ భర్త అడ్డుకోగా అతన్ని కొట్టి ఇటుకలతో దాడి చేశారు. దీంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి ఇద్దరు నిందితులు రాజశేఖర్, విశాల్‌లను బిఎన్ఎస్ చట్టం ప్రకారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పరుశురాం తెలిపారు.

## వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించండి

**దోమ,ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు అసంబ్లీ ఎన్నికల్లోవికలాంగులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షన సమితిరాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారుస.ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిసొంత గ్రామం కొండారెడ్డిపల్లి నుంచి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌వరకు వందలాది మంది వికలాంగులతో పాదయాత్ర నిర్వహిస్తామని తెలిపారు.రాజకీయ రిజర్వేషన్ కల్పించేంతవరకరేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తమ పోరాటాలను ఉధృతం చేస్తామని స్పష్టీకరణ చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ కల్పించడంతోపాటు అసంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చలని డిమాండ్ చేస్తూకొత్తపల్లి గ్రామంలో సంఘం మండల అధ్యక్షుడు సుక్కయ్య అధ్యక్షతన నిర్వహించిన సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైనారు..కొల్లురి ఇదయ్యబాబు,వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పోతురాజు సుదీర్,యువజన విభాగం నాయకులు గుంటిశివకుమార్ చంద్రయ్య,మహేశ్,తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు అనుమతులు వెంటనే ఉపసంహరించుకోవాలి

### బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు యావన్నగారి సంతోష్ రెడ్డి డంపింగ్ యార్డుపై తహశీల్దార్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ

**గుమ్మడిదల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** గుమ్మడిదల, మండలం నల్లవల్లి ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ (ఎంఎస్‌డబ్ల్యూ) అనుమతులు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు యావన్నగారి సంతోష్ రెడ్డి డిమాండ్ చేశారు.డంపింగ్ యార్డుపై అభ్యంతరాలకు గురువారం చివరి రోజు కావడంతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి డంపింగ్ యార్డు వద్దని ఆర్జీలను తహసీల్దార్ పరమేశానికి అందేశారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు యావన్నగారి సంతోష్ రెడ్డి స్థానికులతో కలిసి తహసీల్దార్‌కు డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా మండల వ్యాప్తంగా ప్రజలు డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసనలు, రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌కు చీమ కుట్టినట్లు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎంఎస్‌డబ్ల్యూను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అభ్యంతరాలను వ్యక్తపరిచే చివరి రోజు వీరన్నగూడెం, నాగిరెడ్డిగూడెం, నల్లపల్లి, కొత్తపల్లి, మంబాపూర్, వీరారెడ్డిపల్లి, అన్నారం, దోమడుగు తదితర గ్రామాల ప్రజలు డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా వినతిపాత్రాలను తహసీల్దారు సమర్పించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిమ్ముల జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, జడ్పిటిసి మాజీ సభ్యుడు చిన్నపావని కుమార్ గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, కొత్తపల్లి మల్లేష్ గౌడ్, రాము, ఆకుల సత్యనారాయణ, సూర్యనారాయణ, అంజనేయులు యాదవ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ధర్నాలో పాల్గొన్న ఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పటోళ్ల సంజీవరెడ్డి



ధర్నాలో పాల్గొన్న ఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పటోళ్ల సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై బిజెపి రాజకీయ వేధింపులకు నిరసనగా ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాలను ఎదుర్కోవడం చేతకాక తప్పుడు కేసులు పెట్టికక్ష రాజకీయాలకు తెరలేపుతున్న సందర్భంగా గురువారం హైదరాబాదు మహానగరంలోని ఈడి ఆఫీస్ ఎదుట నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలోసోనియాగాంధీ,రాహుల్‌గాంధీలపై బిజెపి రాజకీయ వేధింపులకు నిరసనగా ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అనంతరం వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం, బీజేపీ నాయకులు రాహుల్ గాంధీపై, వారి కుటుంబంపై ఎన్నోతప్పుడు కేసులు పెట్టి వారిని భయభ్రాంతులకు గురిచేయాలని బిజెపి ప్రభుత్వం చూస్తుందని, ఎన్ని కేసులు పెట్టిన సరే వారిని నమ్మిన ప్రజల కోసం వారు నమ్ముకున్న దేశం కోసం ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారని భయపడే పరిస్థితిలో లేరని వారు అన్నారు. దేశం కోసం వారి కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందని ఈ సందర్భంగా వారు అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతా రెడ్డి

**కొల్చారం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** కొంగోడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులుచ పీఏసీఎస్ చైర్మన్ జ్ఞానిరెడ్డి కృపాకర్ రెడ్డి అంత్యక్రియలకు గురువారం ఎమ్మెల్యే సునితా రెడ్డి హాజరయ్యారు. జ్ఞానిరెడ్డి కృపాకర్ ఒడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలో బుధవారం తీవ్ర గుండెపోటు రావడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ కృపాకర్ రెడ్డి మృతి చెందారు. గురువారం స్వగ్రామమైన కొంగోడు గ్రామంలో అంత్యక్రియలకు నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునితారెడ్డి హాజరై వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ముందుగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు మీ కుటుంబానికి అండగా ఉంటుందని ఆమె కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్చారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాంపల్లి గౌరీ శంకర్ గుప్తా, మాజీ జెడ్పిటిసి పాశం శ్రీనివాస్ రెడ్డి, ముత్యంగారి సంతోష్ కుమార్, గల్వ ఇంద్రసేనారెడ్డి, రమేష్, సత్య గౌడ్, పడిగే నర్సింలు, శివ్వంపేట మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ మెదక్ జడ్పీ కో ఆప్షన్ నెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే భూ భారతి ఉద్దేశం

-టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

**కొండాపూర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే భూ భారతి ఉద్దేశమని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. రైతులకు అండగా ఉండేందుకు భూ భారతి చట్టం భూవివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే భూ భారతి ఉద్దేశమని అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్కపూర్ గోకుల్ ఫంక్షన్ హాల్లో భూభారతి చట్టం ప్రారంభించిన సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం ప్రతి పేదవాడికి అండగా ఉంటుందన్నారు. భూభారతి చట్టం దేశానికి ఆదర్శం కాబోతుందని పేర్కొన్నారు. అదేవిధంగా పాలనాధికారి మాట్లాడుతూ రైతుల భూముల సమస్యలకు భూ భారతితో పరిష్కారం దొరుకుతుందని వెల్లడించారు. రైతు భూమి కొనుగోలు చేసిన వెంటనే పట్టా పాస్‌బుక్ లోనే మ్యాప్ ప్రింటుతో వస్తుందన్నారు. భూదార్‌పై అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ అధికారికి అప్పీల్ చేసుకోవచ్చని అన్నారు ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ మాధురి, టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఆత్మ కమిటి చైర్మన్ వై. ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, ఆర్‌డిఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్‌బి.అశోక్,కాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

## అభివృద్ధి అంటే బిఆర్ఎస్ పాలనలోనే..

### మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



గోడపై బిఆర్ఎస్ పేరును వ్రాస్తున్న మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

**చిన్నశంకరంపేట,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌పాలనలో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మెదక్ మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నశంకరంపేట పట్టణంలో నిర్వహించిన స్థానిక విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ..పదేళ్లలో బిఆర్ఎస్ చేసిన అభివృద్దే కనిపిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో కేవలం కక్షపూరితం తప్ప చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కూల్చివేతలు తప్ప ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నప్పటికి ఇచ్చిన హమిలు అలు చేయడంలో విఫలమైందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హమిలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో నాలుగు లక్షల కోట్లు అప్పు చేస్తే, రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో రూ.1,70,000 కోట్లు అప్పు చేసిందన్నారు.

ఈనెల 27న ఒరుగల్లులో (వరంగల్‌లో) నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ పేరును గోడపై రంగుతో రాశారు. కార్యక్రమంలో మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లిఖార్జున్ గౌడ్, మాజీ ఎఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆంజనేయులు, పార్టీ మండలాధ్యక్షుడు రాజు, చంద్రం, రమేష్ పాల్గొన్నారు.



బిఆర్ఎస్ సభ గోడపత్రికలను అతికిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## బిఆర్ఎస్ మహాసభను విజయవంతం చేయాలి

**చేర్యాల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** ఈనెల 27న బీఆర్ఎస్ పార్టీ తల పెట్టిన రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శివగారి అంజయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటికి ప్రచారం చేస్తూ గోడపత్రికలను అతికించారు. గురువారం జనగామ ఎమ్మెల్యే పలా ల రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో పర్యటించి ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముస్త్యాల నాగేశ్వర్‌రావు, రాచకొండ శ్రీను, పచ్చిమడ్ల మానస, ఉత్కూరి అమర్, పచ్చిమడ్ల బాచి, మిట్టపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పాక బాలయ్య, మహేందర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

**ఆకునూరులో...**

మండలంలోని ఆకునూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పాల బాల్‌రాజు ఆధ్వర్యంలో ఈనెల 27న వరంగల్ జరిగే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సుంకరి మల్లేశం, కోతి దాసు ప్రజాప్రతినిధులు పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మాదిగల హృదయాల్లో నిలిచిపోయిన రేవంత్‌రెడ్డి



రేవంత్, మంద కృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** షెడ్యూల్డ్ కులాల వర్గీకరణతో మాదిగల హృదయాల్లో సిఎం రేవంత్‌రెడ్డి చిరకాలం నిలిచిపోయారని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కొమ్ము విజయ్ కుమార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, సిఎం రేవంత్‌రెడ్డి, మంద కృష్ణ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ నెల 14 నుంచి వర్గీకరణను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మొదటి రాష్ట్రంగా నిలవడం గర్వకారణం అన్నారు. అలాగే మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సెల్ అధ్యక్షులు నాగరి ప్రీతంల సేవలు మరువలేనివని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నరహరి, ఏసు, ఏర్పుల మల్లేశం, ముద్దం లక్ష్మి, మార్క సతీష్, దాస అంజయ్య, పుట్ట ప్రసాద్, పొన్నాల రాజేశ్, ఎర్ర మహేందర్, అశోక్, బయ్యారం యాదగిరి, కనకయ్య, బాలయ్య ఉన్నారు.

## హక్కులను కాలరాస్తున్న వక్ఫ్ చట్టం

**ముస్లిం జెఏసి సభ్యులు అబ్దుల్ సమి**

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**



మాట్లాడుతున్న ముస్లిం నాయకుల

వక్ఫ్‌చట్టం రద్దయ్యే వరకు ముస్లింల పోరాటం ఆగదని జెఏసి సభ్యులు అబ్దుల్ సమి, ముఫ్తీ కరీముద్దిన్ పటేల్ అన్నారు. గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ముస్లింల అస్థిత్వాన్ని తెబ్బ తీసే విధంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ చట్టం ఉందని, ఈ చట్టం రద్దయ్యేవరకు పోరాటం ఆపమన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండే ముస్లింలపై దౌర్జన్యాలు పెరుగుతున్నాయన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం ద్వారా ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాసే విధంగా ఉన్నాయన్నారు. ముస్లిం పర్సనల్‌లా బోర్డు సూచన మేరకు ప్రతీ శుక్రవారం మూడు నెలలు మసీదుల వద్ద శాంతియుత నిరసనలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట మంజీమ్ సుప్రీం బాడీ అధ్యక్షులు హుస్సేన్, జనయితే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ ఖుద్దిస్, కౌన్సిలర్లు అబ్దుల్ మొయిజ్, ఆర్షన్, గౌస్ మోయినోద్దిన్, ఫకృద్దిన్ ఉన్నారు.

## శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు



ఆలయ హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

**బెజ్జంకి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోగల శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయ హుండీని గురువారం పరిశీలకురాలు పి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ జెల్ల ప్రభాకర్‌యాదవ్, ధర్మకర్తల మండలి, పోలీస్, పంచాయతీ కార్యదర్శి, లక్ష్మీనరసింహస్వామి వారి సేవా సమితి అర్చకుల సమక్షంలో 25 రోజుల హుండీ లెక్కింపు చేపట్టగా రూ. 4,80,276 కానుకగా రాగా ఆలయంతో కలుపుకుని మొత్తం రూ 14,09,990 వచ్చినట్లు వారు వివరించారు. వచ్చన నగదును యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బెజ్జంకిలో జమచేసినట్లు ఈవో విశ్వనాధశర్మ తెలిపారు.

## పెన్షన్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

**-జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్**

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త):**

ఏకపక్షంగా తీసుకువస్తున్న కొత్త పెన్షన్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ డిమాండ్ చేశారు. టిపిటిఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన జూపల్లి రాంరెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల కేంద్రం పార్లమెంట్ సభ్యుల పారితోషికాలను ఎటువంటి చర్చలు జరపకుండా పెంచారని, 35 నుంచి 40 ఏళ్ల పాటు ప్రజలను అనేక సేవలందించిన పెన్షనర్లకు మాత్రం పెన్షన్ రివిజన్స్ ఎగనామం పెట్టడానికి బిల్లును ఆమోదించడం అన్యాయమన్నారు.

ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించాలని, లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రం, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, జిల్లా ఉపాధ్యక్షుడు పాపిరెడ్డి, జిల్లా కార్యదర్శి మంజుల, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సైదులు, సుగుణాకర్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, విద్యాసాగర్, సతనతయ్య, పోచం, పర్వతం, నర్సయ్య, రాములు, వెంకటయ్య, రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ గులాబీ సభను విజయవంతం చేయాలి

**ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి**

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త):** బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. జగదేవ్ పూర్‌లోని కేశిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ మండల స్థాయి సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వరంగల్‌లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ రాష్ట్రానికి ప్రతిష్టాత్మకం కావాలన్నారు. సభలో పాల్గొనే కార్యకర్తలను చూసి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల గుండెల్లో రైళ్లు పరుగెత్తాలన్నారు. రాజకీయాలు అంటే జేబులు నింపుకోవడం, అవినీతికి పాల్పడడం కాదని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ఈరోజు కాంగ్రెస్ పాలనలో 15నెలలకే ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందని అన్నారు. గతంలో ఒక పేద ఆడపడుచు వివాహానికి నాలుగు గుంటల భూమి అమ్ముకున్నట్లయితే పెళ్లి చేసేవారని, ఈ రోజు కాంగ్రెస్ పాలనలో నాలుగు ఎకరాలు అమ్మినా పెళ్లి అయ్యే స్థితిలో లేదని, కెసిఆర్ పాలనలో రైతు రాజులా ఉండే వారని, రేవంత్ పాలనలో రైతులు కష్టాలపాలవుతున్నారన్నారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ నాయకులను వారు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ నిలదీయాలన్నారు. కేంద్రంలోని నరేంద్రమోడి ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్



రజతోత్సవ గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

ప్రభుత్వం బడేభాయ్ చోటేభాయ్‌లా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని దోచుకుంటున్నాయని మండిపడ్డారు. తెలంగాణలో కెసిఆర్ హయాంలో ఎన్నో దేవాలయాలు మహర్దశ సంతరించుకున్నాయని, తొలి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే యాదాద్రి నిర్మాణం చేపట్టడం చారిత్రాత్మకంగా నిలిచి మరో తిరుపతిగా శ్రీ యాదాద్రి లక్ష్మీనృసింహ్మస్వామి దేవాలయం సంతరించుకుందన్నారు.

**గెలిచే వారికే స్థానిక సంస్థల్లో టికెట్లు**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రూపు రాజకీయాలకు తావులేకుండా గెలిచే అభ్యర్థులకే కార్యకర్తల సమక్షంలో టికెట్లు కేటాయిస్తామని ఎవరూ నిరుత్సాహపడవద్దని, రానున్నరోజుల్లో మళ్లీ బిఆర్ఎస్ పార్టీయే అధికారంలోకి వచ్చి కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. అనంతరం బిఆర్ఎస్ రజతోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జగదేవ్‌పూర్ పిఏసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి వంటేరు సుధాకర్‌రెడ్డి, గజ్వేల్ ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రంగారెడ్డి, అంకెళ్ల యాదవరెడ్డి, జంబుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు కనకలక్ష్మి చంద్రం, రాచర్ల నరేష్, చంద్రశేఖర్‌గుప్త, మాజీ ఎంపిటిసిలు కిరణ్‌గౌడ్, కవిత శ్రీనివాస్‌రెడ్డి, మాసూరి కావ్య దర్గయ్య, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఎక్బాల్, బిఆర్ఎస్ నాయకులు బుద్ద నాగరాజు, జయమ్మ, యూత్ వింగ్ నాయకులు ఆలేటి సంతోష్‌రెడ్డి, నాచారం మహేందర్, విజయ్‌కుమార్, కొంపల్లి శ్రీనివాస్, దాచారం కనకయ్య, పిట్ల కనకయ్య తదితరులు పాల్గొన్నారు. సీనియర్ నాయకులు



హైదరాబాద్ ఈడి ఆఫీస్ ఎదురుగా ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న బిజెపి

**హైదరాబాద్ ఈడి ఆఫీస్ ఎదుట టిపిసిసి ఆధ్వర్యంలో ధర్నా**

**పటాన్‌చెరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** సిబిఐ, ఈడిలాంటి దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రతిపక్షాల నాయకుల పై అక్రమ కేసులు బనాయిస్తూ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుంది అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ ఆరోపించారు. గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఈడి కార్యాలయం ఎదుటచేపట్టిన భారీ నిరసన కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్సీలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఈడి ని అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై తప్పుడు కేసులు బనాయిస్తూ రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు తెగనమ్ముతూ ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులపై కేసులు పెడుతున్నారని ఆరోపణలు గుప్పించారు. అడ్డగోలుగా బ్యాంకుల్ని ముంచిన కార్పొరేట్ వ్యాపారస్తులకు మద్దతునిస్తూ వారిని దేశం దాటిస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం పేద ప్రజలను నిండా ముంచుతుందన్నారు. నేషనల్ హెరాల్డ్ విషయంలో కక్షపూరితంగా వ్యవహరిస్తూ సోనియా గాంధీ రాహుల్ గాంధీ పేర్లను చార్జిషీట్లో చేర్చడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతూ ప్రతిపక్ష నాయకుల పై తప్పుడు కేసులు పెడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలోనే ఎండగడతామన్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకుల పై పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టి బిజెపి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## దుబ్బాక ప్రభుత్వ ఏరియా హస్పిటల్‌కు బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు

**దుబ్బాక (అక్బర్‌పేటభూంపల్లి), ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** దుబ్బాక ప్రభుత్వ ఏరియా హస్పిటల్‌లో డయాలసిస్ కేంద్రం, 2023లో ప్రారంభించడం జరిగిందని మెడికల్ సూపరింటెండెంట్ డా, హేమరాజ్‌సింగ్ అన్నారు. అప్పటి నుండి ఈ రోజు వరకు 8200 కేసులు డయాలసిస్ చేయడం జరుగుతుంది. అపెక్స్ కిడ్నీ కేర్ ప్రవేట్ లిమిటెడ్ ముంబై వారు దుబ్బాక ప్రభుత్వ ఏరియా హస్పిటల్‌లో డయాలసిస్ సేవాలను గుర్తించి రాష్ట్రంలోని మొత్తం డయాలసిస్ సెంటర్లలో మన దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి మొదటి స్థానములో బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాలసిస్ కేసుల కోసం ఎంతో కృషి చేసిన డయాలసిస్ ఇంచార్జి శేఖర్, హస్పిటల్ సిబ్బంది కృషి ఎంతో ఉందాని తెలిపారు. ఈ కార్యక్రమంలో హస్పిటల్ వైద్య బృందం, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వైద్య బృందం



వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

## డంపింగ్ యార్డు నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి

**గుమ్మడిదల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ప్యారానగర్ నల్లవల్లి డంపింగ్‌యార్డ్(ఎంఎస్‌డబ్ల్యు) ఏర్పాటుపై పర్యావరణ పరిరక్షణ అధికారులకు ఎలాంటి సమాచారం లేదని, డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై అనుమతులు ఇవ్వలేమని అటవీశాఖ, పర్యావరణ శాఖ, జంతువుల సంరక్షక శాఖ, రోడ్డు నిర్మాణ సంస్థ, మండల జేఏసీ సభ్యులతో వివరణ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. డంపింగ్ యార్డుపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నాలుగవ రోజు మండలంలోని మున్సిపాలిటీతో పాటు అన్ని గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తమ అభిప్రాయాలను తెలిపారని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ విజయవంతంగా జరిగింది. మండల పరిధిలోని నల్లవల్లి పంచాయతీ ప్యారానగర్ పరిసర ప్రాంతంలో గత 73 రోజుల క్రితం అర్ధరాత్రి వివిధ రాజకీయ పార్టీల నాయకులను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అరెస్టులుచేసి డంపింగ్ యార్డ్ నిర్మాణంపనులు ప్రారంభించడం పట్ల మండల రైతులు, మహిళలు ఆవేదనకు గురయ్యారని, వెంటనే నిరుత్సాహపడకుండా ఆయా గ్రామాల రైతులు మండల పరిధిలోని ప్యారానగర్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌పై నాటి నుండే పోరాటం చేస్తూ దృఢ సంకల్పంతో గురువారం నాటికి 74 రోజులుగా న్యాయ పోరాటం చేస్తున్నామని జేఏసీ నాయకులు తెలిపారు. మండల వ్యాప్తంగా నిరవధిక సమ్మెలు కొనసాగిస్తున్నప్పటికీ ఈ నెల 3న తేదీన డంపింగ్ యార్డ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ 18వ తేదీ లోపు ప్రజల అభిప్రాయాన్ని తహసీల్దార్‌కు తెలియజేయాలని నల్లవల్లి పంచాయతీ కార్యాలయానికి నోటీస్ వేయడంతో మండల వ్యాప్తంగా అట్టి నోటీసుపై స్పందించి దశలవారీగా గ్రామాల రైతులు, మహిళలు, యువకులు, ప్రజలు వారి వారి అభిప్రాయ పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు, మహిళలు మాట్లాడుతూ పచ్చని పల్లె వాతావరణంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడంతో అటవీ ప్రాంతం వన్యప్రాణులు, వ్యవసాయ పంట పొలాలు పూర్తిగా కలుషితమైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి కార్యక్రమంలో మండల జేఏసీ నాయకులు చిమ్ముల జైపాల్ రెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, సద్ది విజయ భాస్కర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, పలువు గోవర్ధన్ రెడ్డి, యువకులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే సుతారెడ్డి పరామర్శ

**శివ్వంపేట, ఏప్రిల్ 17(ప్రభాతవార్త) :** మండలంలోని దొంతి గ్రామానికి చెందిన ముద్దుల బిక్షపతి తండ్రి మృతి చెందడంతో ఎమ్మెల్యే సునీతరెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న తప్పకుండా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, మాజీ జిల్లా కో ఆప్షన్ సభ్యులు మన్సూర్, మండల కోఆప్షన్ సభ్యులు లాయక్, మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ, నాయకులు హరి ప్రసాద్, రాహుల్, కైఫ్ తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

**శివ్వంపేట, ఏప్రిల్ 17(ప్రభాతవార్త) :** మండలంలోని దొంతి గ్రామానికి చెందిన ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ ముద్దుల బిక్షపతి తండ్రి చెన్నయ్య అనారోగ్యంతో మృతి చెందినందున మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన బుద్దుల రాములు అనారోగ్యంతో మృతి చెందింది వారి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల రూపాయలు ఆర్థిక సంఘం వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సోము అశోక్, గ్యాదరి శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యులు లాయక్, నాయకులు సత్యనారాయణ, కుమ్మరి కృష్ణ, నరేందర్, రాహుల్, దశరథ్, నవీ, గిరిబాబు, కైఫ్ పాల్గొన్నారు.

# అగ్రనేతలపై కేసులు నమోదుపై కాంగ్రెస్ నేతల ఆందోళన

**నర్సాపూర్ ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాజీవ్‌గాంధీలపై అక్రమ కేసులు నమోదు చేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు నిరసన ధర్నా నిర్వహించారు. నిరసన కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నర్సాపూర్ బస్టాండ్ ఎదురుగా గల నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టి ప్రధానమంత్రి నరేంద్ర మోడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఈ అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. ఈడి పేరుతో దేశంలో ఉన్న అనేక పార్టీలను బిజెపి పార్టీ భయభ్రాంతులకు గురిచేసి పబ్బం గడుపుకుంటుందన్నారు. పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉంటే దేశంలో రాజకీయంగా తమ పార్టీకి మనుగడ లేదని ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు సోనియా గాంధీ రాహుల్ గాంధీ లపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోడీ మతోన్మాద శక్తులతో ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నారన్నారు ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు రాహుల్

**నర్సాపూర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం**



ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

గాంధీ ఆధ్వర్యంలో గ్రామాల్లో జై బాపు జై భీమ్ జై సవిత అనే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. డిజిపి పార్టీ చేసే నీచమైన పనులకు భయపడేది లేదని హెచ్చరించారు.

రాబోయే రోజుల్లో బిజెపి నాయకులకు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గుప్తా, బ్లాక్ అధ్యక్షుడు రిజ్వాన్, మాజీ ఎంపీపీలు శ్రీని వాస్‌గౌడ్, లలితా నర్సింగ్ నాయక్, రుస్తుంపేట మాజీ ఎంపీటీసీ అశోక్, నర్సాపూర్ మండల అధ్య క్షుడు మల్లేశం, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ రషీద్, మండల బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు మణిదీప్, మండల మైనార్టీ అధ్యక్షులు అజ్మత్, నాయకులు శ్రీశైలం యాదవ్, మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్‌లో ఉన్న కూలీల డబ్బులు విడుదల చేయాలి

**వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు తాడూరి రవీందర్**

**కొమురవెల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** మండలంలోని పోసన్‌పల్లి గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాడూరి రవిందర్ గురువారం ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు మూడు నెలలుగా కూలీ డబ్బులు అందడం లదని ఆ డబ్బులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూలీ పనులకు ఎక్కువగా బలహీన వర్గాలకు చెందిన ప్రజలు వెల్తుంటారని కూలీ డబ్బులు మూడు నెలలుగా ఆగిపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీలు పని చేసే ప్రదేశాలలో కనీసం సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని, వారికి కావాల్సిన అన్నిన సౌకర్యాలను అధికారులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పుట్ట లక్ష్మన్, కనుకయ్య, అశోక్, వంశీ, శివమ్మ, లచ్చవ్వ, లక్ష్మి తదితరులు ఉన్నారు.

## శ్రీవాణి స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్‌డే వేడుకలు

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** పట్టణం భరత్‌నగర్‌లోని శ్రీవాణి స్కూల్లో యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్‌డే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. గురువారం ఏర్పాటు చేసుకున్న కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సిహెచ్ సత్యం మాట్లాడుతూ చిన్నారులు తమ విద్య ప్రయాణంలో మొదటి మెట్టును విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. భవిష్యత్తులో ఇక్కడి నుండి ఉన్నత చదువులు చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ వేడుకలలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక సీజ్

**చేర్యాల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** అక్రమంగా నిల్వ చేసి ఉంచిన ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని వేచరేణి గ్రామ శివారులో సుమారు వంద ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను అక్రమంగా నిల్వ చేశారని రెవెన్యూ అధికారులకు బుధవారం నమ్మదగిన సమాచారం అందడంతో తహశీల్దారుతో పాటు ఆర్ఐ సంఘటన స్థలానికి చేరుకుని విచారించి సీజ్ చేసినట్లు గురువారం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

## కక్షపూరిత రాజకీయాలు చేస్తున్న బిజెపి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌యాదవ్**



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెప్ నాయకులు

**చిన్నకోడూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** దేశంలో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక పోతున్న భారతీయ జనతాపార్టీ కాంగ్రెస్ పై కక్షపూరిత రాజకీయాలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్‌యాదవ్ అన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ నాయకులతో కలసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ చిత్రపటాన్ని దగ్ధం చేశారు. అనంతరం మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని గాంధీ కుటుంబంపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న బిజెపి ప్రభుత్వంకు దేశంలో రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొరిమిరాజు, పొన్నాల రాజేష్, భూపతిరెడ్డి, రాజు, గణేష్, ప్రశాంత్, జయాంత్, వినోద్ ఉన్నారు.

## ఘనంగా యుకెజి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్ ఉన్నత పాఠశాలలో గురువారం యుకెజి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాల్యంలోనే జ్ఞాన సముపార్జన సాధించే దశలో ఇది అత్యంత కీలకమైన దశ అని అన్నారు. చిన్ననాటి నుండే క్రమశిక్షణతో మెలిగినట్లయితే విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని ఉన్నత ప్రయోజనాలు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు వరం సిఎం రిలీఫ్‌ఫండ్

**కొమురవెల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ అన్నారు. గురువారం గౌరాయపల్లి గ్రామానికి చెందిన కొంత మంది ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధికి ధరఖాస్తు చేసుకోగా వచ్చిన చెక్కులను జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరు ప్రతాపరెడ్డి ఆదేశాల మేరకు లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజమణిశ్రీనివాస్‌గౌడ్, కొమురవెల్లి దేవస్థానం ధర్మకర్త శ్రీనివాస్, తాజామాజీ ఎంపిటిసి కవితనాగరాజుతో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన

**వర్గల్, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం గౌరారం అంగన్వాడీ కేంద్రంలో గురువారం గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పోషణ పక్షంలో భాగంగా వెయ్యి రోజుల సంరక్షణ గురించి డాక్టర్ హరిత, ఎంపిడిఓ మశ్చేందర్ వివరించారు. గర్భిణీ, బాలింతలు చిరుధాన్యాలతో చేసిన ఆహారాన్ని తీసుకోవాలని, మంచి ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రారెడ్డి, సిసి పద్మలత, పోషణ అభియాన్ కిరణ్, హెచ్‌ఈఓ రవికుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాణి, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు డైరీ ఆవిష్కరణ

**కొమురవెల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లిఖార్జునస్వామి దేవాలయంలో గురువారం దేవాలయ అర్చక ఉద్యోగుల అతిధి గృహంలో అర్చక ఉద్యోగులు, వేద విద్యార్థులతోకలిసి తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసి చైర్మెన్ గంగు ఉపేంద్రశర్మ తెలుగు డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నుండి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖలు దేవాలయాల అభివృద్ధికి కృషిచేయడం హర్షించదగ్గ విషయమన్నారు. మే 15 నుండి రాష్ట్రంలోని కాళేశ్వరంలో జరిగే పుష్కరాలకు ప్రత్యేక నిధులు విడుదల చేసిన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహాదేవుని సాంబయ్య, వేద పండితులు మధుసూదన్‌శర్మ, శబరిసన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లిఖార్జున్, మనోహర్, శివప్రసాద్, సిద్దేశ్వర్, సూర్యకుమార్, వినయ్ కుమార్, వీరేశలింగం తదితరులు ఉన్నారు.



తెలుగు డైరీని ఆవిష్కరించిన అర్చక ఉద్యోగ జెఏసి చైర్మన్



ధరణికి బంగారు పతకం అందచేస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

## ధరణికి బంగారు పతకం బహూకరణ

**రామచాంద్రాపురం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజక వర్గం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలకు చెందిన ధరణి జాతీయస్థాయి అథ్లెటిక్స్ రన్నింగ్‌లో బంగారు పతకం సాధించడంతో గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టభద్రులు ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ధరణికి సూచించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు సి గోదావరి అంజిరెడ్డి, ధరణి తండ్రి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏడాకులపల్లిలో జొన్నల కొనుగోలు కేంద్రం



ఏడాకులపల్లిలో జొన్నల కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివకుమార్

**ఝరాసంగం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఏడాకులపల్లిలో జిల్లా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఉమ్మడి మెదక్ జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ రైతులు జొన్న పంటలను మధ్యదళారులకు అమ్ముకుని ఆగంకాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తరలించి క్వింటాలుకు రూ. 3371 అందుకుని లబ్దిపొందాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంతమ్మ ఏడాకులపల్లి రైతుబంధు మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ప్రభుపాటిల్, సొసైటీ డైరెక్టర్ అనంత్‌రామ్‌గౌడ్, శ్రీనివాస్, ఏఈఓ వేద, అసిస్టెంట్ రిజిష్టర్ జహీరాబాద్ సర్కిల్ అధికారి పోముసింగ్, రైతులు సంగారెడ్డి, బద్రి వెంకట్, నర్సిములు, సొసైటీ సీఈఓ శ్రీశైలం పాల్గొన్నారు.

## 3 గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

### ప్రారంభించిన ఎమ్మెల్యే, టిజి ఐఐసి చైర్మన్



ఇంద్రకరణ్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్‌లు

**కంది, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు ఇంద్రకరణ్, నాగపూర్ గ్రామాల్లో సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే చింత ప్రభాకర్, టిజి ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మలజగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రాలకు ధాన్యాన్ని తరలించే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. దొడ్డు రకం ధాన్యానికి ప్రభుత్వం రూ. 500 బోనస్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రైతు భరోసా కింద ఏడాదికి 15వేలు చెల్లించాలని రైతులను ఆదుకోవాలన్నారు. పూర్తి స్థాయిలో రైతుల రుణాలను మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్‌లు ప్రభాకర్ రెడ్డి, గోపాల్, మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు కొండల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**అప్పాజిపల్లిలో ...**



అప్పాజిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీశేషారెడ్డి

**అల్లాదుర్గం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అప్పాజిపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం వటుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీశేషారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని మధ్యదళారులకు అమ్ముకుని ఆగం కావొద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రానికి తరలించి అర్థికంగా లబ్దిపొందాలని సూచించారు. తహసీల్దార్ మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, అల్లాదుర్గం సొసైటీ చైర్మన్ దుర్గారెడ్డి మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2320, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2300 అందచేస్తారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుభాష్‌రావు దేశ్‌పాండే, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బసన్నగారి బలరాం, నాయకులు కురుమ నాగయ్య, శ్రీనివాస్‌గౌడ్, గందలి రవి, శ్రీనివాస్, ఫర్యనాయక్, సొసైటీ కార్యదర్శి శివగౌడ్, అధికారులు నాగయ్య పాల్గొన్నారు.

## అంతర్గావ్‌లో 'బడిబాట'

**సిర్గాపూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అంతర్గావ్‌లో ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు 2025-26 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని కరపత్రాల పంపిణితో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలలకు కాకుండా అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని పోషకులకు సూచించారు. గ్రామం నుంచి ప్రయివేటు పాఠశాలలకు వెళుతున్న వారి ఇళ్లకు చేరుకుని ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరించారు. ప్రైవేటు వద్దు, ప్రభుత్వమే ముద్దు అని పోషకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, జ్యోతి ఉన్నారు.



అంతర్గావ్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి : కార్పొరేటర్



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అధికారులను ఆదేశించారు. గురువారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో కార్పొరేటర్ కార్యాలయంలో అధికారులలో అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా పుష్పనగేష్ మాట్లాడుతూ బాలవిహార్ పార్క్, సండే మార్కెట్, 12, 13వ బ్లాక్‌లలో సిసి రోడ్లు, నూతన అక్టోగోనల్ పోల్స్, సండే మార్కెట్ రోడ్డు విస్తరణలో పోల్, ట్రాన్స్‌ఫార్మర్‌ల తరలింపు, నూతన లైటింగ్ తదితర పనులను మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిలు ప్రారంభోత్సవాలు చేస్తారని, అందుకు పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. త్వరలో 1.60 కోట్ల సీవరేజ్ లైన్‌లు మంజూరు కానున్నాయని, అందుకు సిసి రోడ్ల ప్రతిపాదనలు పూర్తిచేయాలని, సిసిరోడ్లకు నిధులు మంజూరు చేయిస్తామన్నారు. వేసవికాలంలో కరెంటు, నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్, జల మండలి అధికారులకు సూచించారు. శానిటేషన్ సమస్య రాకుండా చూడాలని, వారంరోజుల్లో రెండు రోజులు ఉదయం 5 గంటలకు బస్తీ కాలనీల్లో అధికారులు మార్నింగ్ వాక్ చేయనున్నట్లు వివరించారు. పెన్షన్‌లకు బాధితులు తగు ఆధారాలతో దరఖాస్తులు పూర్తిచేసి పటాన్‌చెరు, రామచంద్రాపురం జిహెచ్‌ఎంసి కార్యాలయంలో అందచేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, ఎఎంఓహెచ్ విజయ్‌మోహన్, ఎస్ఎస్ పవన్, ఎఎంసి సురంజన్, ఇంజనీరింగ్ డీఈ నరేంద్ర, ఏఈ దివ్య తేజ, విద్యుత్ డీఈ లక్ష్మీప్రియ, ఏఈ తిరుపతమ్మ, ప్రాజెక్టు అధికారి ప్రభాకర్, కమ్యూనిటీ అధికారి జ్యోతి, ఎంటమాలజీ ఏఈ తిరుపతయ్య, యుబిడి మేనేజర్ మానస, హెచ్ఎంయూఎస్ డిజిఎం శివ కృష్ణ, మేనేజర్ లోకేష్, నేషనల్ హైవే ఏఈఈ శ్రీకాంత్, డాక్టర్ కల్పన, సానిటేషన్ ఏఎస్ఆర్పీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో అగ్ని ప్రమాద నివారణపై అవగాహన

**సదాశివపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం పట్టణ శివారులోన ప్రిన్స్ పైప్స్ అక్సీజెంటా, ఎవరెస్ట్ ఆర్గానిక్స్ లిమిటెడ్ పరిశ్రమలో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ బిక్షపతి, ఏఎల్ఎఫ్ సురేష్‌రెడ్డి, సిబ్బంద ఆర్ రవికుమార్, ఎం రాజ్‌కుమార్, డిఓపిటి శ్రీశైలం, పరిశ్రమ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు భూభారతిపై అవగాహన సదస్సు : తహసీల్దార్

**రామాయంపేట మున్సిపాలిటీ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** నేడు(శుక్రవారం) నిర్వహించే భూభారతి అవగాహన సదస్సును విజయవంతం చేయాలని తహసీల్దార్ రజనికుమారి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి పోర్టల్‌ను ఇటీవల ప్రారంభించిందన్నారు. అందులో భాగంగా ప్రభుత్వం నూతనంగా ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. రైతుల భూమి హక్కుల భద్రత,సత్వర పరిష్కారం, రైతుల మేలు కోసం ప్రజాపాలనలో చారిత్రాత్మక మార్పు తీసుకురావడానికి భూభారతి కార్యక్రమాన్ని చేపట్టిన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి కార్యక్రమంలో మండలంలోని రైతులు ఏవైనా భూ సమస్యలు ఉంటే నేరుగా వచ్చి పరిష్కరించుకోవచ్చని ఆమె సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న ఈకార్యక్రమానికి మండలంలోని రైతులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొంటారని ఆమె తెలిపారు.

## 18న విశ్రాంత ఉద్యోగుల కోసం...కంటి వైద్యశిబిరం

రామాయంపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : విశ్రాంత ఉద్యోగుల కోసం ఈనెల 18వ తేదీ శుక్రవారం నాడు రామాయంపేట పట్టణంలో కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ అగర్వాల్ కంటి దవాఖాన ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్యంను దృష్టిలో ఉంచుకొని ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## వెంకటాపూర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

**నిజాంపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** నిజాంపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని అసైన్డ్ రాష్ట్ర భూ సమితి ప్రెసిడెంట్ బైండ్ల నందు ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో రాజిరెడ్డి హాజరయ్యారు. ఉచిత మెగా వైద్య శిబిరానికి 200 మందికిపైగా ప్రజలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైనవారికి బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 60 మందికి పైగా చెవి, ముక్కు, గొంతు, థైరాయిడ్, గర్భసంచి సంబంధిత శరీర సంబంధవ్యాధులకు గాను ఉచితంగాను ఆపరేషన్ చేయించడానికి 60 మందికి రిఫర్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ప్రేమ, కాంగ్రెస్ నాయకులు ముత్యాల మధుసూదన్‌రెడ్డి, మల్లారెడ్డి హాస్పిటల్ బృందం డాక్టర్ పుజీత, మనీష, దుర్గాస్తుతి, హరిహోమ్, స్టాఫ్ నర్స్‌లు సోని, గాయత్రి, ఫార్మా కరిష్మా, మార్కెటింగ్ మేనేజర్ ఎండి మహమ్మద్, హరికృష్ణ, గట్టు ప్రశాంత్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**నిజాంపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన పొడాల మల్లేశం కుమారుడు నవీన్(19) రెండు నెలల క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో నడుముకు దెబ్బలు తగలడంతో హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించగా 15 లక్షలకు పైగా ఖర్చు అయిన తర్వాత ఖర్చు పెట్టలేని స్థితిలో ఉండి చల్మెడ గ్రామానికి తీసుకురాగా 15 రోజుల తర్వాత మృతి చెందాడు. విషయం తన తెలుసుకున్న కంతారెడ్డి తిరుపతిరెడ్డి గురువారం మృతుని తండ్రికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈకార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ నంధ్యాల బాల్‌రెడ్డి, ఆకుల మహేష్, పార్టీ అధ్యక్షుడు రాగుల బాబు, మాజీ ఎంపిటిసి కిష్టాగౌడ్, భాజ సత్తయ్య, బాజ కృష్ణ, ఆకుల తిరుమలయ్య, ఆకుల భాస్కర్, సంగెపు స్వామి, బెస్త రమేష్, పొడాల నరేష్, కంపె పర్శయ్య, ఆకుల యాదగిరి, పొడాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

**శివ్వంపేట, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త) :**

మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన దుగ్గూరు సత్యనారాయణ, యాక్సిడెంట్‌తో కాలు తీసివేసినందున,అదే గ్రామానికి చెందిన ప్రశాంత్ ప్రమాదవశాత్తూ మృతి చెందినందున, అదే గ్రామానికి చెందిన మేకల పోచయ్య మృతి చెందినందున, అదే గ్రామానికి చెందిన ఇమ్రాన్ చెట్టుపై నుండి కింద కిందపడి కాలు విరిగినందున, అదే గ్రామానికి చెందిన నరాల సహదేవ్ గుండెపోటుతో మరణించినందున బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నవీన్‌గుప్తా పరామర్శించి ఒక్కో కుటుంబానికి 5వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు, ఈ సందర్భంగా నవీన్ గుప్తా మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్బర్, సురేందర్ రెడ్డి, మహమ్మద్ ఖాన్, వారాల గణేష్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఇసు గారి అరుణ్, కళ్యాణ్, ప్రేమ్ కుమార్, శ్రీను, రాకేష్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .



మాట్లాడుతున్న వికలాంగుల సంఘం నాయకులు

## వికలాంగుల పెన్షన్ పెంపునకు చలో హైదరాబాద్

**రామాయంపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వీహెచ్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బాచిపల్లి పాండు, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు వికలాంగులకు పెన్షన్ పెంపు కోసం ఈనెల 19న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలంలో జరిగిన అసెంబ్లీ సమావేశాలలో సిఎం, ఎమ్మెల్యేలు వికలాంగుల సమస్యలపై మాట్లాడిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాగా వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని తెలిపారు. అదేవిధంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు గ్రామీణ స్థాయిలో 8 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు 4 వేల పెన్షన్ పెంచుతామని చెప్పి ఇప్పటి వరకు పెన్షన్ పెంచలేదన్నారు. ఇప్పటికైనా 4 వేల పెన్షన్‌ను 6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి జిల్లాలోని వికలాంగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు వసిరం, ఎర్రగుళ్ల మహేష్, బూరు సంతోష్, పాతూరు శ్రీనివాస్, బాలకృష్ణ, సంధిగళ్ల భూమయ్య పాల్గొన్నారు.

## బేతాళస్వామికి బోనాల జాతర

**అల్లాదుర్గం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బేతాళ స్వామి జాతర ఉత్సవాలు నేత్ర పర్వంగా కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం బేతాళస్వామికి బోనాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు ఇండ్ల నుంచి బోనాలు ఎత్తుకుని ప్రధాన రహదారికి చేరుకుని భక్తి శ్రద్దలతో గోవిందా నామాన్ని స్మరిస్తూ డోలు వాయిద్యాలతో శివసత్తుల నృత్యాలతో ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. బోనాలను తిలకించేందుకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తన సిబ్బందితో గట్టి బందోబస్తును నిర్వహించారు.

**నేడు బేతాళ స్వామికి బండ్ల ప్రదక్షిణలు...**

జాతర ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం నుంచి బేతాళ స్వామికి ప్రధాన ఘట్టమైన బండ్లతో ఊరేగింపు నిర్వహించి బేతాళుడికి జాతర బండ్లు ప్రదక్షిణలు చేయిస్తారు. బండ్ల ఊరేగింపులో మండల పరిధిలోని కాయితంపల్లి, బహిరన్‌దిబ్బ, ముస్లాపూర్, అప్పాజీపల్లి, రెడ్డిపల్లి, మాందాపూర్‌లతోపాటు జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి రంగు రంగు కాయితాలలో అలంకరించిన ఎడ్ల బండ్లు ఊరేగింపుగా అల్లాదుర్గంకు చేరుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయనున్నట్లు జాతర నిర్వాహకులు పేర్కొన్నారు. జాతరకు రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి 3 లక్షల మంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారని నిర్వాహకులు అంచనా వేశారు. ఆలయానికి తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కల్గకుండా తగు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటి బాధ్యులు పేర్కొన్నారు.

## మాజీ మంత్రికి ఆహ్వాన ప్రతిక అందచేత

**సదాశివపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును గురువారం యువజన సంఘం నాయకులు కలుసుకుని ఈ నెల 20న పట్టణంలో నిర్వహిస్తున్న సుహాసిని పూజా కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానపత్రికను అందచేశారు. పూజా కార్యక్రమానికి హాజరవుతానని హరీష్‌రావు సానుకూలంగా స్పందించినట్లు బిఆర్ఎస్ నాయకులు చింత సాయినాథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు నాగేష్, నాగనాథ్, వేణు, సతీష్, రాజు, మల్లేశం, రవి, సంతోష్, వంశీ, అభిలాష్, రాము, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



హరీష్‌రావును ఆహ్వాన పత్రికను అందచేస్తున్న చింత సాయినాథ్

# నీటి సంరక్షణ, భూగర్భ జలాలను పెంచడమే వాటర్‌షెడ్ల లక్ష్యం




కుసంగిలో వాటర్‌షెడ్ల ప్రారంబోత్సవ యాత్ర ర్యాలీ తీస్తున్న దృశ్యం

**టేక్మాల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** భూమి, నీటి సంరక్షణ పెంచడమే లక్ష్యంగా వాటర్‌షెడ్ల లక్ష్యమని డిఆర్‌డిఎ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం టేక్మాల్ మండల పరిధిలోని కుసంగిలో వాటర్‌షెడ్ల ప్రారంభోత్సవ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ పరుగెత్తే నీటిని ఆపడంతో భూగర్భ జలాలును పెంచడం, ఇంకుడు గుంతలను నిర్మించడం, ఊట కుంటలు నిర్మించడం, ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. వాటర్‌షెడ్ భూమి యొక్క ఒక ప్రత్యేకమైన భౌగోళిక ప్రాంతం, ఇది వర్షపు నీరు, మంచు కరిగి ఒక నది, సరస్సు లేదా చిత్తడిలోకి ప్రవహించే ఒక సాధారణ బిందువుకు వెళ్తుందన్నారు. వాటర్‌షెడ్ నిర్వహణ ద్వారా సహజ వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చన్నారు. వర్షపు నీరు నేలను కొట్టుకుపోకుండా అరికట్టవచ్చునన్నారు. ఇది పర్యావరణాన్ని రక్షించడానికి సహాయపడుతుందన్నారు. వర్షపునీటిని భూమిలోకి ఇంకిస్తే భూగర్భ జలాలను పెంచవచ్చని, వాటర్‌షెడ్ పథకం వర్షాభావ ప్రాంతాల్లో నిర్దిష్ట విధానాలతో వాన నీటి సంరక్షణ చేసి భూగర్భ జలాలను పెంచడం వాటర్‌షెడ్ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. నిజానికి వాటర్‌షెడ్ విధానం వర్షాధార వ్యవసాయ సాంకేతికత చర్యగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్ ఉదయ్‌కుమార్, సతీష్, విఠల్, మాజీ కో ఆప్షన్ మెంబర్ యూసుఫ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్, వాటర్ షెడ్, శశిరేఖ వాటర్‌షెడ్ టీమ్ రాజశేఖర్, టేక్మాల్ ఎపియం శకుంతల ఎపిఓ పొలు, సీసీలు శ్రీనివాసరెడ్డి, దుర్గయ్య, రామయ్య, స్వరూప, ఇందిర, జనబాయి, మహిళా సంఘాల సబ్యులు, రైతులు పాలొన్నారు.




చలో వరంగల్ బ్యానర్‌తో ప్రచారం చేస్తున్న ఆదర్శ్‌రెడ్డి

## చలో వరంగల్‌ను సక్సెస్ చేయాలి : ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** ఈ నెల 27వ తేదీన వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి వాల్‌బ్యానర్‌తో జోరుగా ప్రచారం చేస్తున్నారు. గురువారం పటాన్‌చెరు డివిజన్‌లో నిర్వహించిన ప్రచారంలో ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసంచేస్తూ పాలన సాగిస్తోందన్నారు. రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలిరావాలని సూచించారు.

**బండ్లగూడ బిఆర్ఎస్ అధ్యక్షుడిగా భరత్...**

పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండ్లగూడ బిఆర్ఎస్ అధ్యక్షులుగా భరత్‌ను ప్రకటించారు. పార్టీ అభ్యున్నతికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భరత్‌కు ఆదర్శ్‌రెడ్డి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌గౌడ్, శ్రీధర్ చారి, మాణిక్‌యాదవ్, నవీన్, రామకృష్ణ, సాయి, జానీ పాల్గొన్నారు.

## రజతోత్సవ సభ విజయవంతానికి బిఆర్ఎస్ పాదయాత్ర

**జహీరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కావాలని నాయకులు పాదయాత్ర నిర్వహించారు. సంకష్టహార చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ గ్రామ శివారులోని స్వయంభూవు శ్రీ సిద్ధివినాయక ఆలయం వరకు బిఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్ ఆధ్వర్యంలో పాదయాత్రగా బయలుదేరి వెళ్లి అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నామ రవికిరణ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి చేసిన తప్పులను క్షమించి సద్గతి బుద్ధిని ప్రసాదించాలని ప్రథమ పూజలందుకునే పార్వతీదేవి తనయుడు సిద్ధివినాయకుడిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. బిఆర్ఎస్ న్యాల్‌కల్ మండల అధ్యక్షుడు మున్నూర్ రవీందర్ మాట్లాడుతూ ప్రజలు రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నార అన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ, న్యాల్‌కల్ మండల నాయకులు మాతంశెట్టి రాజ్‌కుమార్, ఎంఆర్ ప్రవీణ్‌కుమార్, తులసిదాస్‌గుప్తా, నరసింహారెడ్డి, టేక్మాల్ గణేష్, వెంకటేశం, ఆజయస్వామి, నిఖిల్ ముదిరాజ్, వడ్డే నాగేష్, సుకుమార్, చంద్రకాంత్, మారుతి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**న్యాల్‌కల్, ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు హద్నూర్, చాల్కి, ఖలీల్‌పూర్ గ్రామాల్లో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులు తీసుకువచ్చిన మూగ జీవాలకు (ఆవులు ఎడ్లు, గేదెలు)లకు టీకాలువేసి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయా గ్రామాల్లో 65 ఆవులు, 58 ఎద్దులు, 87 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు డాక్టర్ గణేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో పశువైద్య సిబ్బంది జెవిఓ కిషన్, ఎలెస్ఎ సంజయ్, రమేష్, ఓస్ మాజీద్, తిప్పమ్మ, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## వంగ్దాల్‌లో ఘనంగా పోషణ పక్వాడా

**సిర్గాపూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వంగ్దాల్‌లోని అంగన్‌వాడి కేంద్రంలో గురువారం పోషన పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భిణీలకు, బాలింతలకు, తల్లులకు పోషకాహారం లోపాలపై అవగాహన కల్పించారు. గర్భం దాల్చిన మొదటి రోజు నుంచి రెండేళ్ల వరకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చిన్నారులకదకు కేంద్రంలో ఆటపాటలు ఆడించి పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్నేహ భావన, ఉపాధ్యాయులు సుజాత, కాంతమ్మ, రాధ, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

**కంది, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పాఠశాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ వెంకటేశ్వర్లు పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుకు సహకరిస్తున్న దాతలు కాశీనాథ్, సురేష్‌నాయక్, యండి తయ్యబ్‌లను అభినందించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగకు కృషిచేస్తున్న ఉపాధ్యాయుల పనితీరును కొనియాడారు. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. పాఠశాల బాధ్యులు డీఈఓను, దాతలను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జోగప్ప, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి, చేర్యాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకట రాజయ్య, ప్రధానోపాధ్యాయులు లీలావతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వనజ, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్, మండల అధ్యక్షులు సిద్దేశ్వర్, పిఆర్‌టియు మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సిఆర్‌పి విష్ణు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ యంఇ మహేసన్, ఉపాధ్యాయులు యండి ఖరోద్దిన్, ప్రమీల చంద్రమోహన్, పోషకులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ అతికించిన ఎమ్మెల్యే



రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను అతికిస్తున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సదాశివపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** ఈ నెల 27న హనుమకొండలోని ఎన్కతుర్తిలో నిర్వహిస్తున్న బిఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను గురువారం ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింత ప్రభాకర్ అతికించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ కేసిఆర్ బహిరంగ సభతో దేశ రాజకీయాల్లో చర్చ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు అపర్ణశివరాజ్‌పాటిల్, చింతా గోపాల్, శివరాజ్‌పాటిల్, మాజీ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్ నాయక్, విద్యాసాగర్‌రెడ్డి, ముబిన్, మోమియోద్దీన్, నసీర్, సత్యం, సతాని శ్రీశైలం మన్నె మల్లేశం, శ్రీధర్‌రెడ్డి, కొడురి అంజన్న, విద్యాసాగర్‌రెడ్డి, చౌదరి ప్రకాష్, రాజు విజయ్‌కుమార్, బరాడీ సాయి, బోడపల్లి అవినాష్‌దిడిగే నాగేష్, బెజ్జల సాయి డప్పు నర్సింలు, సున్నం కిరణ్, సత్యనారాయణ, వదోని రాజు, పెద్దగౌడ్, జబ్బర్ పాల్గొన్నారు.

## రోడ్లపై ధాన్యం ఎండబెట్టుకోవద్దు : ఎస్ఐ

**పాపన్నపేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** రైతులు పంటలను రోడ్లపై ఆరబెట్టుకోవద్దని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. గురువారం మిన్‌పూర్, యూసుఫ్‌పేట గ్రామాల శివారులో ధాన్యం ఆరబోసిన రైతులకు ఎస్ఐ పలు సూచనలు చేశారు. రోడ్లపై ధాన ఆరబెట్టుకోవడం, రాత్రి పూటక ధాన్యం కుప్పలపై నల్లని టార్పాలిన్‌లు కప్పి ఉండటంతో అటుగా వాహనాలపై వచ్చే చోదకులకు అవి కానరాక ప్రమాదాలకు గురయ్య అవకాశాలు ఉంటాయన్నారు. రైతులు రోడ్లపై కాకుండా ఇతర చోట్ల ప్రజలకు, వాహన చోదకులకు ఇబ్బంది కల్గకుండా ధాన్యంను ఆరబెట్టుకోవాలని సూచించారు.

## 21 సార్లు రక్తం దానం చేసిన శ్రీకాంత్‌రావు

**సిర్గాపూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన యువకుడు శ్రీకాంత్‌రావు హైదరాబాద్ మలక్‌పేట్‌లోని యశోద ఆసుపత్రి లో గురువారం 21వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రావు మాట్లాడుతూ రక్తదానం చేయడం మూలంగా ఒక కుటుంబానికి ఒక వ్యక్తికి తన వంతు కర్తవ్యకంగా ఒక సహాయంగా భావిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయాల్సింది ప్రజలకు సూచించారు.